# కథ

## దోరవేటి

# కేరం-రాకెట్-స్కైలాబ్

**"అసలు మా అమ్మానాన్న మంచి పేరు పెట్టలేదురా! అందుకే నేనేమీ సాధించలేకపోతున్నా!" ఎప్పటిలాగే దిగులుగా అన్నాడు సుబ్బారావు.**

**"ఛ! నీ పేరుకేమైందిరా? బంగారం లాంటి పేరు!"**

"నువ్వు మూస్తావా?" కయ్‌మని అడ్డుకున్నాడు సోమలింగాన్ని సుబ్బారావు.

"ఆ ముసిల్ది...మా బామ్మ కూడా ఇలాగే అనేది- 'బంగారం లాంటి పేరు బంగారం లాంటి పేరూ' అని, కాని అసలు నిజం తెలిసిపోయింది. సుబ్బారా వంటే వెర్రెంగళప్ప అని అర్థంట."

ఎగిరిపడ్డాడు సోమలింగం.

అది పట్టించుకోనే లేదు సుబ్బారావు- "అందుకే పాపం సుబ్బారావు అంటూ పనికిమాలిన సానుభూతినొలకబోస్తూ బోలెడు కథలొచ్చేస్తుంటాయి పత్రికల్లో. అంతెందుకు? నాకు తెలిసిన సుబ్బారావులంతా ఆ బాపతే" కళ్లల్లో మిరపకాయలు, గొంతులో వెలక్కాయలూ..

ఆ మాటల షాక్ నుండి తేరుకునేందుకు సోమలింగంకు కొంచెం టైం పట్టింది. వాడి ఉక్రోషం చూస్తూంటే నవ్వు కూడా వచ్చింది. కానీ నవ్వితే సుబ్బులుగాడు మరింత అపార్థం చేసుకుంటాడని, బాధ నటించేశాడు కూడా.

"ఎంచక్కా ఏ వెంకటేశో, సురేశో, మహేశో...పోనీ, వినాయకో, పట్నాయకో అయినా బాగుండేది. అలా క్కాపోతే తేజ, ఉదయకిరణ్, పవన్ కళ్యాణ్, చిరంజీవి, నాగార్జున...కనీసం ప్రభాస్, మనోజ్ లాంటి పేరు పెట్టినా ఈపాటికి ఎక్కడో ఉండేవాడిని...హు! డబ్బారావు, జబ్బుల్రావు అన్నట్టు ఈ సుబ్బారావే మిత్రా?! ఇలాంటి పేర్లు నచ్చకనే వెనకటికి గోరా, కారా, రారా, పోరా అని కసిదీరా పేర్లు కుదించుకుని గొప్పోళ్లైపోయారు కొంతమంది. అజ్ఞానిని, అల్పబుద్ధిని అల్లాగైనా చేయలేకపోయాన్నేను. ఇంతకూ నా పేరుకు అసలు ఏదైనా అర్థం ఏడ్చి చచ్చిందంటావా?" మళ్లీ కళ్లనీళ్లు తన్నుకొచ్చాయి.

"ఒరేయ్ సుబ్బారావనేది చాలా మంచి పేరురా!" వాడలా అడుగుతాడని ఊహించని సోమలింగంకు సమాధానం తోచలేదు వెంటనే. "సుబ్బారావంటే...సుబ్బా...రావన్నమాట. అంటే సుబ్బరంగా ఉండేవాడన్నమాట." అనుకోకుండా తనకింత మంచి ఆలోచన రావడంతో బోలెడు ఆశ్చర్యపోయి ఆనందపడిపోయాడు సోమలింగం.

"నాకు నచ్చలా!" మొహం చిట్లించాడు సుబ్బారావు. అంతలోనే తన దీనస్థితి గుర్తుకొచ్చి డీలా పడిపోయాడు. తన ఈడువాళ్లంతా తండ్రులయ్యారు. తాను మొగుడుకాదు సరికదా ప్రేమికుడైనా కాలేకపోయాడు. చూస్తుండగానే ముప్పై మూడొచ్చాయి- యేళ్లు. ఫ్రెండ్సంతా గుడ్‌నైట్ చెబుతూ "ఎంజాయ్ యువర్ సెల్ఫ్!" అనే వారు. ఆ మాట వెనుక ఇంత ఎత్తిపొడుపు, అంత శ్లేష, ఇంతంత వ్యంగ్యముందని అర్థమయ్యేసరికి ఏడుపొక్కటే తక్కువ. కాలేజీ చదివే రోజుల్లోనూ తను రిజర్వ్ బెంచీకే పరిమితం. అయినా ఎవర్నయినా పరిచయం చేసుకోవాలంటే ముందు తన పేరు చెప్పాలి గదా! ఏమని చెబుతాడు? అందుకే ఇష్టంలేని పేరు చెప్పడం ఇష్టం లేకనే ఎవ్వరికీ ఇష్టుడు కాలేకపోయాడు. పోనీ తను అందంగా ఉండడనుకోవడానికీ వీల్లేదు.

సూటిగా ఉండే ముక్కు (మొహంలో అదొక్కటే ఉన్నట్టు పోజు) విశాలమైన నుదురు (జుట్టు తక్కువ ఉండటం వల్ల అలా అనిపిస్తుందని అసూయాపరులంటుంటారు), బింబాధరాలు (కాకపోతే హైబ్రీడ్ దొండకాయల్లా సైజు పెద్దవి), చూపులో కొంచెం తేడా కనిపిస్తేనేం? అది అదృష్టానికి గుర్తు కదా! (అదీ కళ్లద్దాల మాటున కనిపెట్టడం కష్టమే), చక్కటి జుట్టు (ఇది మాత్రం పచ్చి నిజం. తుమ్మజిగురు పెట్టినా అది వంగదు, అణగదు) ఎత్తు తక్కువే అయినా మాంచి స్లిమ్ బాడీ (గట్టిగా తుమ్మితే ఎగిరిపోతాడని ఎద్దేవా చేస్తారు కిట్టని వాళ్లు).

"నీకేం నాయనా! అందానికందం, ఆంధ్రా బ్యాంకులో ఉద్యోగం, రేటు అధమం ఐదు లక్షలకు తగ్గదని రెచ్చగొట్టే వారు తెలిసినవాళ్లు. వాళ్లన్నవన్నీ నిజమే. కాకపోతే అమ్మాయిలే నచ్చలేదు. కొందరైతే పేరులోనే నచ్చలేదు. ఇంకా ఎన్నాళ్లీ నిరీక్షణ? కట్నం లేకున్నా సరే కంటికి నచ్చిన అమ్మాయి కనిపిస్తే మూడుముళ్లేద్దామని కమిటైపోయినా ఆ ఘడియ మాత్రం రాలేదు.

అలా తరచూ తనదైన 'విచార' ధారలో కొట్టుకుపోయే సుబ్బారావును చూసి జాలిపడటం, నిట్టూర్చడం, సానుభూతి ప్రకటించడం లాంటి ఫార్మాలిటీస్ మాత్రం సోమలింగానికి అలవాటయ్యాయి.

కానీ కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. సుబ్బారావు నిరీక్షణ ఫలించి ఓ ముద్దుగుమ్మ పరిచయమైంది. ఆమె పేరు కేరం...ఆమె తండ్రి పేరు రాకెట్, తల్లిపేరు స్కైలాబ్. ఆమెకింకెవరూ లేకపోవడం సుబ్బారావు చేసుకున్న అదృష్టం. లేకపోతే ఆ పేర్లు గుర్తు పెట్టుకోవడం మకతికై పోయేవాడే. అందుకే దొరక్క దొరక్క దొరికిన అమ్మాయిని కొరుక్కు తినేలా చూడకుండా, అనవసరమైన అడ్వాన్సుల జోలికెళ్లకుండా, అతిచొరవ చూపకుండా అత్యంత జాగ్రత్తగా ఫ్రెండ్‌షిప్ నడిపిస్తున్నాడు. ఆ స్నేహం ముదిరి, అభిమానమై అది ఏడడుగుల బంధానికి చేరువవుతున్నట్టు అనిపించసాగింది. సుబ్బారావులో పేరు పట్ల ఉన్న జబ్బు తగ్గకపోయినా, కేరం ప్రేమ (లాంటిదాని)లో కొంత మరచిపోగల్గుతున్నాడు. అనుకోకుండా మూణ్రోజులుగా కేరం కనిపించకపోయేసరికి అతని జీవన గమనం కొంచెం గతి తప్పినట్లయింది. అన్యమనస్కంగా, భారంగా రోజులు లాగిస్తున్నాడు. సరిగ్గా అప్పుడే అతనికి క్యాష్ కౌంటర్‌లో డ్యూటీ పడటం మాత్రం యాదృచ్ఛికం.

"హలో సుబ్బారావ్! ఫోన్ నీకే!" కేకేసి చెప్పాడు రాజారావు.

'తనకు ఫోన్‌చేసే వాళ్లెవరుంటారు? ఆ దిక్కుమాలిన సోమలింగం గాడే. అసలే ఈ రోజు రష్షెక్కువగా ఉంది.' అనుకొని "తర్వాత మాట్లాడతానని చెప్పు!" అని యథాలాపంగా అనేసి తన పనిలో లీనమయ్యాడు.

పులిమీద పుట్రలా అప్పుడే పెదరాయుడి లాంటి మీసాల్రాయుడొకడొచ్చాడు. పధ్నాలుగు వందల యాభై రూపాయలు. అన్నీ యాభైల నోట్లే కావాలని అడిగాడు. రాజకీయ నాయకుల్తో గొడవ పెట్టుకోకూడదనే ఇంగితం గల్గిన వాడు కావడాన మారు మాట్లాడక ఆ మూడు వందల తొంభై ఒక్క నోట్లు లెక్కపెట్టడానికుపక్రమించాడు. ఎలక్ట్రానిక్ కౌంటర్ కూడా పనిలో పనిగా అప్పుడే చెడిపోయింది.



"ఎవరో ఆడాళ్లయ్యా!" కాస్త విసుగ్గా చెప్పాడు రాజారావు.

రెండు వందల డెబ్బై దాటిన కౌంటింగ్ ఆగిపోయింది. మళ్లీ మొదలు పెట్టగానే సదరు రాయుడు విసుక్కున్నాడు. మళ్లీ తప్పింది...

"ఏదో అర్జెంటటయ్యా!" వంద దాటకుండానే మరో మారు తప్పేలా చేశాడు పనిగట్టుకున్నట్టు రాజారావు.

ఇహ తప్పదన్నట్టు లేచి "ఒక్క నిముషం..." అంటూ రాయుడిని రిక్వెస్ట్ చేయబోయాడు.

"ఇప్పటికి గంటయ్యింది. డబ్బులిచ్చి కదులు!" అతడు బలవంతుడే కాదు. అనాగరికుడు కూడా. అసలే తనకు మంచి పేరుంది. ఉన్న పేరు పోగొట్టుకుని, లేని పేరు కొనితెచ్చుకోవడం ఇష్టం లేక తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మరచి, కసిదీరా ఒక్కొక్క నోటూ లెక్కపెట్టి ఆ శాల్తీకిచ్చాడు. ఈ నేపథ్యంలో రాజారావు ఎన్నిసార్లు గుర్తు చేసినా తనను కాదన్నట్టే ఉండిపోయాడు.

కౌంటర్‌లో రష్ తగ్గాక తాపీగా రాజారావు దగ్గరికెళ్లి "ఆ! ఏంటీ ఏదో ఫోనన్నారు?" అడిగాడు స్టయిల్‌గా.

"ఆ! ఈపాటికా అమ్మాయి ముసిల్దయిపోయి ఉంటుంది" వెటకారంగా రాజారావు.

"ఏ అమ్మాయి?" ఏదో అనుమానం సడెన్‌గా అతడ్ని చుట్టేసింది.

"ఆ! ఏదో పేరు చెప్పిందయ్యా... ఆ...కారమో...కేరమో..."


"ఆ! కేరమా?" కళ్లు బైర్లు కమ్ముతుండగా, పడిపోకుండా కుర్చీపట్టుకున్నాడు సుబ్బారావు.

★ ★ ★

కేరం చిరునామా తెలుసుకోనందుకు తనను

తాను కసిదీరా తిట్టుకున్నాడు సుబ్బారావు. 'అయినా ఏదో హాస్టల్లో ఉంటున్నానంది కదా! ప్రయత్నం చేస్తే దొరక్కపోదు' అనుకొని 'విక్రమార్కు' పట్టుదల ప్రదర్శించాడు. టౌన్‌లోని అన్ని హాస్టళ్లు చుట్టేసినా ఆచూకీ కనిపెట్టడంలో మాత్రం సఫలం కాలేకపోయాడు. కాగా, ఆ పేరు వినగానే అవమానాలూ, అనుమానాలు, ఎక్కసక్కాలూ ఎదురయ్యాయి కూడా.

ఆ రాత్రి సరిగ్గా నిద్రపట్టలేదు సుబ్బారావుకి. మరుసట్రోజు సమయానికి ముందే బ్యాంకుకెళ్లి మేనేజర్ గదిలో కూర్చున్నాడు, ఫోనుంది అక్కడే మరి. మేనేజర్ వచ్చాక, వ్యాపారవేళలు ప్రారంభమైనా అక్కడి నుండి కదల్లేదు. చివరకు కథ సెలవుపెట్టుకునేదాకా వెళ్లింది. అంతేకాదు ఎవరికి ఫోనొచ్చినా ముందు తనే రిసీవ్ చేసుకొని, ఎదుటివాళ్లకి సమాచారం ఇవ్వసాగాడు. చూస్తుండగానే లంచ్ టైం అయింది. 'వ్రతం చెడ్డా ఫలం దక్కలే'దన్నట్టు ఎదురుచూసిన ఫోన్ కాదుగదా, అతని కోసం ఏ ఫోనూ రాలేదు. 'ఏ పాటు తప్పినా, సాపాటు తప్ప'దనుకుంటూ క్యాంటిన్‌కెళ్లి రెండు ముద్దలు అన్నం తిన్నాడో లేదో...



## ప్రయాణంలో పదనిసలు

తారల ప్రయాణాలు విచిత్రంగా ఉంటాయి. మొన్నామధ్య భార్య టీనాతో కలిసి విమాన ప్రయాణం చేసిన అక్షయ్‌కుమార్‌కి ఇలాంటి అనుభవమే ఎదురైంది. ఈ ప్రయాణంలో శిల్పాషెట్టి, పూజాబాత్రా కనబడడమే అందుకు కారణమేమో! వారితో కాసేపు మాట్లాడదామనుకున్నా భార్య పక్కనే ఉండడం వల్ల మాట్లాడలేకపోయాడట. ఏం మాట్లాడితే ఏం అవుతుందో అని తెగ ఇబ్బంది పడుతూ ముళ్ళమీద కూర్చున్నట్టు సీట్‌లో కూర్చుని ప్రయాణం అయిందనిపించాట్ట. పాపం పిటీ!

"సార్...! ఫోన్!" అంటూ పరుగెత్తుకొచ్చాడు అటెండర్ అవతారం.

ఆనందంతో అంతెత్తునెగిరి, ఓ గావుకేక పెట్టి, ఆదరాబాదరాగా పరుగెత్తి ఫోనెత్తాడు సుబ్బారావు. 'కుయ్... కుయ్... కుయ్...కుయ్.." అంటూ మొరగడం నేర్వని కుక్కపిల్లలా అన్ కనెక్టెడ్ టోన్ మూగ వేదన వినిపిస్తోంది ఫోను. ఆనందమంతా ఆవిరై పోగా ఏడుపు ముంచుకొచ్చింది సుబ్బారావుకి.

అక్కడే కూర్చొని బకాసురుడిలా క్యారేజీ ఖాళీ చేస్తున్న మేనేజరు మీద పడిందతని దృష్టి. "ఫోనొచ్చి ఎంతసేపైంది సార్?" కోపాన్నణచుకుంటూ అతడ్నడిగాడు.

జవాబు చెప్పడం ఇష్టం లేనట్టు మొహం పెట్టాడు మేనేజర్ బాబూమోహన్. అంతలోనే తినే సమయం కొంత వేస్టయ్యిందన్నట్టు, ఆవురావురుమంటూ గుక్క తిప్పుకోలేనంత పెద్ద ముద్ద నోట్లో పెట్టుకొని '5 నిమిషాలు' అన్నట్టు ఎడమ చేతివేళ్లు చూపించాడు.

"ఐదు నిముషాల క్రితం ఫోనొస్తే ఇప్పుడా చెప్పేది?" కోపాన్ని నిగ్రహించుకోలేకపోయాడు ఈసారి సుబ్బారావు.

'నన్నే, మర్యాద లేకుండా అలా అడుగుతావా?' అన్నట్టు గుడ్లురిమి చూశాడు బాబూమోహన్.

మింగలేక కక్కలేక, 'అత్తమీది కోపం దుత్తమీద చూపినట్లు' రిసీవర్‌ని కసిదీరా క్రెడిల్ చేసి, అక్కడి నుండి విసవిసా నడిచాడు సుబ్బారావు. క్యాంటిన్‌కెళ్లి చల్లారిన అన్నంలో చెయ్యి పెట్టి కలిపి, ఒక్క ముద్ద నోట్లో పెట్టుకున్నాడో లేదో మళ్లీ ప్రత్యక్షమయ్యాడు అవతారం.

"సార్! ఫోన్!"

ఇహ లాభం లేదని, ఎంగిలి కంచం అలాగే పట్టుకొని ఉన్న ఫళంగా మేనేజర్ గదిలో ప్రవేశించాడు.

"ఏంటయ్యా నీ అవతారం? ఇది ఆఫీసనుకున్నావా? నీ ఇల్లనుకున్నావా?" అగ్గిరాముడిలా దండకం అందుకున్నాడు మేనేజర్.

'దున్నపోతు-వాన' సామెతకు ఆ దండకాన్ని అంకితం చేస్తూ కుడిచేతిలో ప్లేటు పట్టుకొని, ఎడమచేత్తో రిసీవరెత్తాడు-"హలో...!" ఏదో టెన్షన్. తొలిసారి ఫోన్‌లో తన కేరంతో మాట్లాడబోవడం...

'మదిలో వీణలు మోగు'తూండగా, మధురమైన కేరం కంఠస్వరం వినేందుకు ఊపిరి బిగబట్టాడు.

"ఒరే సుబ్బులూ! నేన్రా..." అవతల్నుండి గరగరగా సోమలింగం.

ఏడుపు, బాధ, కోపం ఒకేసారి కలిగాయి సుబ్బారావుకి. 'ఇంతా చేస్తే, ఫోన్ చేసింది ఈ యెదవా?!' "ఒరేయ్! నువ్వా?" గారిగా, బాధగా అరిచాడు. ఆ అరుపుతో పొలమారి, గొంతాగిపోయి కళ్ల నుండి నీళ్లు దూకాయి ఫౌంటెన్లలాగ.

అది చూసి కంగారు పడిపోయిన బాబూమోహన్ పనిలో పనిగా జాలిపడిపోయి గ్లాసెడు నీళ్లందించాడు సుబ్బారావుకి.

తింటున్న కంచం మేనేజరు చేతికిచ్చి, ఎంగిలిచేత్తోనే ఆ గ్లాసందుకొని, గడగడా పోసుకోసాగాడు సుబ్బారావు.

సరిగ్గా అప్పుడే గుమ్మంలో ప్రత్యక్షమయ్యాడు రీజనల్ డైరెక్టర్. కోపంలో దుర్వాసుడు, నియమాల్లో యమధర్మరాజుగా అతను సుప్రసిద్ధుడు.

"నీకు తిండియావ ఉందని తెలుసుగానీ, మరీ ఇంత అనాగరికుడి వనుకోలేదయ్యా" అని తిడ్తూనే మరోవైపు చిందులు కూడా వేశాడు.

ఫోన్ సంగతి సరే, పరువు కాపాడుకోవడమే ప్రధాన కర్తవ్యమని ఎంచి, ఎంగిలి చేయి డైరెక్టర్‌కి కనబడకుండా జాగ్రత్త పడ్తూ అక్కడి నుండి జారుకున్నాడు - చల్లగా.

★ ★ ★

"ఒరేయ్! నీకసలు బుద్ధుందా? ఎందుకు ఫోన్ చేశావురా?" సాయంత్రం సరాసరి వాళ్ల ఆఫీసుకెళ్లి అడిగాడు సోమలింగాన్ని, సుబ్బారావు.

"హు! ఎందుకు చేస్తే ఏంలే? నువ్వయితే మాట్లాడలేదుగా?!" నిట్టూరుస్తూ, నిర్లక్ష్యంగా- సోమలింగం.

"ఎగస్ట్రాలొద్దు. అసలెందుకు చేశావో చెప్పు?" నిలదీశాడు సుబ్బారావు.

"నేం జెయ్యలేదు మహాప్రభో! ఆ కేరం జేసింది!" సీరియస్‌గా సోమలింగం.

క్షణకాలం ఏమీ అర్థంకాలేదు సుబ్బారావుకి. "కేరం జేయడమేమిట్రా? నీ గొంతే గదా నేను

వింటా" జుట్టు పీక్కున్నాడు సుబ్బారావు.

"చేసింది నేనే కానీ, చేయించింది కేరం" సుబ్బులు మొహంలోకి చూస్తూ అసలు సంగతి చెప్పాడు సోమలింగం- "కేరం నిన్న ఓ పూటంతా ట్రై జేస్తే ఈ దొరగారు మాట్లాడలేకపోయారటగా. నా దగ్గరికొచ్చి చెప్పింది. నిన్ను కాపాడుకునే సదుద్దేశ్యంతో నేనూ నీ సిన్సియారిటీ గురించి పెద్ద బిల్డప్పిచ్చి, ఈ రోజు లంచ్‌టైంలో వస్తే మాట్లాడిస్తానన్నాను...ఒకటికి రెండుసార్లు ట్రై చేశా..."

విషయం పూర్తిగా అర్థమై కుర్చీలో నీరసంగా జారగిలబడిపోయాడు సుబ్బారావు. 'దరిద్రుడు దరఖాస్తేస్తే దప్తరు లేచి పోవడ'మంటే ఏమిటో స్వానుభవంతో తెలుసుకున్నాడు సుబ్బారావు. "ఈ సంగతి నిన్న రాత్రైనా నాకు చెప్పొచ్చుగదరా!" ఏడుపాగలేదు.

"చెప్పొచ్చనుకో! నువ్వుండేది గాంధీనగర్‌లో, నేనుండేది సుభాష్‌నగర్‌నాయె. అద్దెకొంపల్లో ఫోనెందుకంటూ నువ్వు ఫోన్ పెట్టించుకోవు. కనీసం సెల్..."

"ఇప్పుడవన్నీ అవసరమా?" కారణమేదైతేనేం లే! అన్నట్టు సుబ్బారావు ఎగిరిపడ్డాడు.

తను తప్పనిసరై సకుటుంబంగా సినిమాకెళ్లానని, ప్రతి శుక్రవారం 'మందు వ్రతం' పూర్తి చేసుకోవడం తప్పలేదని కారణాలు చెప్పే అవసరం తప్పింది సోమలింగానికి. చివరకు,అసలు విషయం మాత్రం చెప్పక తప్పలేదు.

"ఆమెకి వాళ్ల మేనబావతో సంబంధం ఖాయం చేస్తానన్నాట్ట వాళ్ల నాన్న. ఆ విషయం మాట్లాడేందుకే ఆమె ప్రయత్నించింది. ఎంతో నిరాశతో ఈ మధ్యాహ్నమే వాళ్ల ఊరెళ్లింది."

కొన్ని విషయాల్లో తొందరపడకపోవడం ఎంత ప్రమాదమో తెలిసొచ్చింది సుబ్బారావుకి. ఏదో ఆలోచనలు మదిలో మెరుస్తుండగా అడిగాడు- "ఏ ఊరు?"

"అక్కంపేట!"

* * *

మిత్రులిద్దరూ అక్కంపేటలో దిగేసరికి చీకటి పడిపోతోంది. అంతకు మించిన చీకటి వాళ్ల గుండెల్లో అలుముకోసాగింది. కారణం అరగంట గడిచినా వాళ్ల ప్రయత్నం అర మిల్లీమీటరూ ముందుకు సాగలేదు.

"ఏం పేరు?" అనుమానంతో అతను మళ్లీ అడిగాడు.

"కేరం" సందేహిస్తూనే మరోసారి చెప్పాడు సుబ్బారావు.

"తండ్రి పేరు?" ఆశ్చర్యాన్ని నొక్కిపడుతూ అతను.

"రాకెట్" నిర్లిప్తంగా సుబ్బారావు.

"తల్లి పేరు?" నవ్వు బిగబట్టుకోలేక ఉక్కిరిబిక్కిరౌతూనే అతడు.

"స్కైలాబ్" తప్పనిసరైనట్టు సుబ్బారావు.

బాంబు పేలినట్టు అక్కడ పోగైన వాళ్లంతా నవ్వేశారు.

వీళ్లిద్దరూ అయితే పిచ్చాసుపత్రి నుండి వచ్చిన వాళ్లు గానీ, కాకపోతే గ్రహాంతరవాసులు గానీ కావచ్చని కన్‌ఫమ్ చేసుకుంటూ పడీపడీ నవ్వసాగారు అక్కడ పోగైన వాళ్లంతా.

నిరాశతో వెనుదిరగడం తప్ప మార్గాంతరం లేదనే నిర్ణయానికొచ్చారు సోమలింగం, సుబ్బారావులు. సుబ్బారావు మనసైతే బోల్డు కోపంతో, అవమానంతో కుతకుతలాడిపోసాగింది. ఈ తమాషానంతా గమనిస్తున్న పూర్ణచంద్ర అనే ఓ యువకుడు వాళ్ల ముందుకొచ్చాడు హఠాత్తుగా.

"ఆ అమ్మాయి పోలికలు చెప్పగలరా?" కోర్టులో క్రాస్ ఎగ్జామిన్ చేస్తున్న డిఫెన్స్ లాయరులా అడిగాడు.

'చెప్పాలా? వద్దా?' అనుకుంటూనే వివరంగా చెప్పాడు సుబ్బారావు.

"వార్నీ...! ఆ అమ్మాయి మన రంగమ్మ గావచ్చురా" వివరాలన్నీ పోల్చుకొని తేల్చేశాడు ఒక్క నిముషంలో పూర్ణచంద్ర. నిజంగానే ఆ అమ్మాయితో పాటు ఆమె టౌన్లో ఏ హాస్టల్లో ఉంటున్నదీ సరిపోయాయి.

"అమ్మాయి పేరేమన్నారు...కేరం...కదూ! కరెక్టే ఆమె పేరు రంగమ్మ. వాళ్లింటి పేరు- కే" మహాశక్తి సిమెంటంత దృఢంగా నొక్కి వక్కాణించాడు పూర్ణచంద్ర.

"కే...అంటే?" అడిగాడు సోమలింగం.

"వాళ్లింటి పేరు కుంటి"

పడిపోతున్న సుబ్బారావుని పట్టుకోవడం కష్టమైంది సోమలింగానికి.

* * *

"మీరనుకుంటున్నట్టు పేర్లను బట్టి మనుషులు తయారుకారు. మనుషుల్ని బట్టే పేర్లకు గుర్తింపు వస్తుంది. అప్పారావులంటే అస్తమానం అడుక్కునే వాళ్లని, వెంగళప్పలంటే అంతా వెర్రివాళ్లని, దానయ్యలంటే దిక్కూమొక్కూ లేని వాళ్లనీ కాదు. పుల్లారెడ్డి మిఠాయిలు తియ్యదనానికి ప్రసిద్ధి. కసిరెడ్డిగారు సౌమ్యమూర్తిగా గుర్తింపు పొందారు.

సుబ్బారావనే మీ పేరు బాగాలేదని అనుకుంటున్నారు గానీ సాహితీప్రియులందరూ ఇష్టపడే నండూరి సుబ్బారావు, తెలుగువాళ్లు ఆరాధించే రాయప్రోలు సుబ్బారావు ఎంతటి ప్రసిద్ధులో మీకు తెలియదా? సుబ్బారావంటే సాక్షాత్తూ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి! రంగమ్మంటే శ్రీరంగనాథ స్వామి పేరు నుండి తీసుకున్న ..."

అలా అనర్గళంగా సాగిపోతోంది రాములు వాక్ప్రవాహం.

అతను రంగమ్మ తండ్రి. ఎదురుగా ఉన్న సోమలింగం, సుబ్బారావుల నుద్దేశించే ఆ క్లాసు.

"మీరు టీచరా?" ఆ ప్రవాహానికి అడ్డుకట్ట వేశాడు సోమలింగం.

అథ్లెట్‌లా ఆ హర్డిల్ దాటేసి మరో మాటందుకున్నాడు రాములు-"మా ఇంటి పేరు కుంటి. మా ఇంట్లో మూణ్నాలుగు తరాలుగా కుంటివాళ్లే లేరు. ఎప్పుడో, ఏ కారణం చేతనో ఆ పేరు వచ్చుంటుంది. మీ ఇంటి పేరు?" సుబ్బారావునడిగాడు.

ఇబ్బందిగా మొహం పెట్టి, చెప్పాననిపించాడు సుబ్బారావు "పి-పుల్ల..."

"చూశారా! ఆ పుల్ల వస్తుసంబంధమో, రుచి సంబంధమో, మీ ఆకార.."

"మీరింక మాట్లాడకండి! నాకు కేరం...నచ్చింది. ముహూర్తాలు పెట్టుకుందాం!" అరిచినట్లే అన్నాడు సుబ్బారావు.

ఆ విధంగా సుబ్బారావు, రంగమ్మల పెళ్లయిపోయింది. శోభనం రాత్రి కేరం తమ పేర్ల గుట్టు విప్పింది పూర్తిగా.

తండ్రి పేరు కే.రాములు కాబట్టి ఇంటి పేరును వెనక్కి చేర్చి, కొంచెం మోడిఫై చేసి రాకెట్‌గా మార్చిన వైనం, తల్లిపేరు ఎస్.కె.లలితాంబను చక్కగా స్కైలాబ్‌లా ఒదిగేలా చేసిన తీరు...

ఇదంతా చేయడానికి సుబ్బారావుకు పేర్ల పట్ల గల దురుద్దేశ విధానం...

పరిచయ క్రమం...అలా తండ్రిని మించిన కూతురై మాట్లాడుతూంటే, రేయంతా ఆవిరైపోతుందన్న బాధతో అసలే లేటు అందులో ముహూర్తం లేటు, రాత్రీ లేటు...భరించలేక ఆమె పెదవులకు తన పెదవుల్తో తీయగా తాళం వేసేశాడు.

